# సలహా

శ్రీమతి
ఇ. సరస్వతి

మోటారుకంపెనీనుంచి వస్తున్న లక్ష్మీకాంతరావుని ఎగాదిగా చూసి, 'ఏం ఇంతపొద్దున్న బయలుదేరావు ఇటు?" అన్నాడు రామారావు.

తలవంచుకుని 'ఆ కారు ఎంతచేస్తుందో తెలిసినవాళ్లకు ఎవరికయినా చూపించి ధరచేయాలి' అని యోచిస్తున్న లక్ష్మీకాంతము రామారావుని చూడగానే ఉలిక్కిపడ్డాడు.

కంపెనీలో ఉన్న స్నేహితుడితో మాట్లాడటానికి వచ్చానని సమాధానము చెప్పినా, మనసులో బాధగానే ఉంది—తనమీద రాజ్యంతో - ఏం చాడీలు చెప్తాడో అని. సహాయం లేకపోగా ఆలివంకవారు ఇందుకు పనికివస్తారు.

నాలుగేళ్లనుంచి అక్కౌంటెంటుగా పనిచేస్తున్న లక్ష్మీకాంతరావు సంసారాన్ని జాగ్రత్తగా, గౌరవంగా నెట్టుకొస్తున్నాడు. పొదుపువిషయానికొస్తే, భర్త ఎంత పొదుపరో భార్య అంత జాగ్రత్త కలది. అట్లా అని వాళ్లు ఖర్చులంటే వెనక్కడుగు వేసే రకముకాదు. అవసరాన్నిపట్టి, అతని పరిస్థితులనుపట్టి ఎప్పటికప్పుడు ఖర్చులే వస్తున్నాయి. అయినా సిగరెట్టుముక్కన్నా పీల్చే అభ్యాసంలేదు. కాబట్టి ఏదో కొంత నిలవచేశాడు. పిత్రార్జితం ఏమీలేకుండా సంసారం గడుపుకుంటూ నిలవలో పడ్డాడంటే యీకాలంలో చెప్పుకోతగ్గ విషయమే అంటారు ఇరుగు పొరుగు. ఆ నిలవ కావటమే ఈమధ్య భార్యాభర్తలలో కొంత అశాంతిని పుట్టించింది.

ఏమిటంటే అసలుసంగతి—లక్ష్మీకాంతము మొదట్నుంచీ ఏదో ఒక ఉద్దేశము మనసులో పెట్టుకునే జాగ్రత్తగా డబ్బువాడుకునేవాడు. కొంత నిలవకాగానే ఆ ఊహను అమలుపరచాలని దృఢపరచుకున్నాడు. అప్పుడప్పుడు స్నేహితులతో 1940 సం॥ తాను రేడియో ఒకటి, చిన్న కారు ఒకటి కొంటానని చెప్తూవచ్చాడు. ఆ మాటలు మెల్లగా రాజ్యంచెవిన పడ్డాయి. అదివరకు మాటమాత్రమయినా తనతో చెప్పని భర్త, అందరితో చెప్పటమే మొదలు ఇద్దరికి.

ఒకరోజున భర్తకు మజ్జిగ వడ్డిస్తూ, మన పక్కసందు కవతలి వీధిలోని రెండవయిల్లు వేలము వేస్తున్నారు. రెండువేలపైచిల్లరట. విన్నారా! అంది రాజ్యము. 'వెధవది తుక్కు ఇల్లు ఐఉండవచ్చు. అందుకే రెండువేలు. మాటమాటకు రిపేరు చేయవలసివస్తుంది' అని కనుబొమ్మలు ముడివేసి అన్నాడు రామారావు.

ఆ యిల్లు కొనమని భార్య అడగనూలేదు భర్త నిరాకరించనూలేదు. అంతే ఆ సంభాషణ. ఇరుగు పొరుగు విషయంగా ఆమె చెప్పింది; తగిన సమాధానము ఇచ్చాడు అతను.

దాంతోటి ముక్తసరిగా మాట్లాడుకోవటం మొదలుపెట్టారు దంపతులు. కొన్నాళ్ళకు భోజనానికి లేవమని చెప్పటానికి రాజమ్మకు, వంటయిందా కనుక్కో అని అడగటానికి లక్ష్మీకాంతానికి రామారావు అవసరమయినాడు. ప్రతివాళ్లకు కోపం రాగానే ఓ మధ్యవర్తి ఉంటే, వాళ్లతో కోపం వెళ్ళబోసుకుంటూ

ఉంటారు. సంధి రాయబారాలుకూడా పెట్టారు. చివరకు తప్పంతా మధ్యవర్తిమీదపెట్టి చివరికి వారే తప్పు కొని కులాసాగా ఉంటారు.

'బాబుగారూ మీరు చెప్పండి కాస్త. ఏదో నాలుగుడబ్బులు నిలవ ఉన్నప్పుడే, ఇల్లు అనేది చూస్తే బాగుంటుందని నా మనసులో ఉంది. ఏదిచేసినా పిల్లలు ఎదగకముందే చూడాలి. పిల్లలు పెద్ద వాళ్ళయితే ఖర్చు లెక్కువవుతాయి చదువులని—సంధ్యలని—తరువాత మనం ఏంకట్టగలము ఇల్లు? చెప్పండి. ఇప్పుడు రేడియో అని, మోటారని కూర్చుంటే ఎట్లా? వీటికేమో వాటి ఖరీదుకాకుండా నెలనెలకు ఖర్చు. ఇల్లంటే ఒకసారి కొంటే ఇంక దమ్మిడీఅయినా ఖర్చులేదు. శాశ్వతంగా పడిఉంటుంది. మీరు కాస్తచెప్పండి ఆయనకు' అంది రాజ్యము నరసింహారావుగారితో.

నరసింహారావు లక్ష్మీకాంతానికి మేనమామ, రాజ్యానికి పినతండ్రి. ఇప్పుడు రిటైరు కావటము నుంచి ఉచితంగా బంధువులకు, ఇరుగు పొరుగువాళ్లకు న్యాయమైన సలహాలిస్తూఉంటాడు. మంచి సానుభూతి చూపిస్తాడు ప్రతివాళ్ళ విషయంలో. ఎవరికీ మనసు నొప్పించకుండా తగవు పరిష్కారం చేయాలనే ఉద్దేశంతో, 'రాజ్యం చిక్కిపోయావెందుకూ యీమధ్య' అన్నాడు.

'ఏమిటో బాబూ' అని తప్పించుకొంది రాజ్యము. దాంతోటి రాత్రి, పగలు రాజ్యానికి ఇంటి ధోరణి ఎక్కువయిందనీ, చాలా పట్టుదలగా ఉందనీ గ్రహించి, 'కనుక్కుంటాలే రాజ్యం. సరేగాని పిన్ని లేవటంలేదు బొత్తిగా. వంటవాళ్ళకు ఎంతచెప్పినా సరిగా కుదరటములేదు పథ్యము. నాలుగురోజులపాటు పథ్యం పానం ఇక్కడవుండి చూద్దూ. లక్ష్మీకాంతానికి నేను కబురుచేస్తాలే. భోజనానికి వస్తాడు' అన్నాడు యుక్తిగా.

తమలపాకులు వేసుకుంటూ 'మామయ్యా! నాకు చాల ఇబ్బందిగా ఉంది ఆఫీసుకు వెళ్లటానికి. ఒక చిన్నకారు కొందామనుకుంటున్నా. మీ సలహా ఏమి'టని అడిగాడు లక్ష్మీకాంతం, అంతవరకు తనకారు విషయమై ఏవిధమైన రిపోర్టు పోలేదనే ఉద్దేశంతో.

'అయితే కారు లేకపోతే ఇంకనుంచి గడవదంటావు అంతేనా' అన్నాడు న్యాయశాస్త్రవేత్త.

'కాదు గాని అందరికీ ఉంది, నాకే లేదు అక్కడ. అందుకని నాకు చిన్నతనంగా ఉంది. ఇంతెందుకు—నాకంటె చిన్నఉద్యోగి ఆస్టినులో ఎక్కి తిరుగుతాడు. నాలుగయిదు వందలుపెట్టి మంచి రేడియో కొన్నాడు ఈమధ్య. ఎంత బాగుందనుకొన్నారు. వాడింటికి వెళ్లితే నాకు రాను బుద్ధిపుట్టదు' అన్నాడు.

అవునులే. నాకుమాత్రము తెలియదూ నీ అవసరం? అయినా యీకాలపువాళ్లకు అవునన్నది కాదంటే జబ్బుచేస్తుంది. నీవూ మంచి యోచనపరుడివేగా—నా సలహాకేంగాని—అని సముదాయించాడు.

ఎటువాళ్లను అటు సర్దిచెప్పి సానుభూతి చూపిస్తూ మాట్లాడాడు గాని ఏ సలహా ఎవరికివ్వాలో ఆయనకేం పాలుపోలేదు. అన్నాళ్లు జిల్లాజడ్జి పనిచేసాడు—అన్నికేసులు తీర్పుచెప్పాడు—అంతమందికి సలహాలిచ్చాడు—ఇప్పటికి ఆ వాడలో ఏ తగవువచ్చినా పరిష్కారంచేస్తాడు అత్తాకోడళ్ల తగవులతో సహా. అటువంటి ఆయన ఈ దంపతుల కిద్దరికీ సలహా యివ్వలేకుండా ఉన్నాడు.

తల్లిదండ్రీ పోయినప్పటినుంచి, తననే తల్లిదండ్రీగా భావించిన రాజ్యానికి భర్తమాట విని కారు కొనమంటే ఏం చిన్నబుచ్చుకొంటుందో—ఆడపిల్ల!

పోనీ ఇల్లు తీసుకోవయ్యా కారుకేం తొందర అంటే—లక్ష్మీకాంతం—అసలే కచ్చమనిషి—తనకు అనుగుణంగా సలహాయిస్తేనే తప్పు, లేకపోతే గడప అయినా తొక్కడు.

ఎవరికి ఎటు సమాధానము చెప్పకుండా గోడమీదపిల్లి వాటంగా మాట్లాడుతూ దినాలు గడుపుతున్నాడు.

ఎవరివైపు తీర్పుచెప్తాడో అని భార్యకూ ఆందోళనే—భర్తకూ ఆందోళనే. కదిలిస్తే రంగం చెడుతుందని ఓ భయం మళ్ళీ యిద్దరకు. సలహా లేకుండానే సమాధానపెట్టూ, దినాలు దాటవేస్తుంటే యిద్దరికీ కష్టంగానే ఉంది.

ఎవరికయినా ఎన్నాళ్లుంటుంది ఓపిక? తన వ్యవహారాలే గాని ఇంకోటిలేదు ఆయనకు!

చివరకు విసుగెత్తి 'ఏంమామయ్యా ఊరుకున్నా'రని బొమలు ముడివేస్తూ అడిగాడు లక్ష్మీకాంతం.

'నాయనా తొందరపడితే పనులవుతాయా? నీ ఆలోచన బాగానే ఉంది. ముఖ్యంగా ఉండవలసినదే కారు, రేడియో. అక్కడక్కడ కంపెనీలలో చెప్పి ఉంచు. నేనూ చూస్తూ ఉంటాలే' అన్నాడు నరసింహారావు.

'ఆ యిల్లు మరీ యిరుకుసందులో ఉందమ్మా, ఎక్కడయినా రోడ్డుమీదగా ఉన్నస్థలముగాని, ఇల్లుగాని బేరంచేస్తు ఉంటాలే. లక్ష్మీకాంతము ఏదయినా ఆడావడిచేస్తే నొచ్చుకోకు. నీసంగతి నాకు తెలియదా ఏమిటీ?' అని రాజ్యాన్ని సమాధానపెట్టాడు.

ఒకటి రెండు సార్లు కంపెనీలనుంచి కార్లు తీసుకొచ్చాడు లక్ష్మీకాంతం చూపించటానికి. రోడ్డు చివరదాకా కారులో తిరిగి 'అబ్బే పదినాళ్లు ఉండదురా ఇది' అని పెదవి విరిచాడు నరసింహారావు.

తప్పకుండా మామ మెచ్చుతాడనే ఉద్దేశంతోవున్న లక్ష్మీకాంతానికి ఈమాటలు వినగానే మింగుదామన్నంత కోపం వచ్చేది మనసులో. ఒకసారి ఆయనయిచ్చిన సలహాను పాటించకపోతే యింక పలుకరించనైనా పలుకరించని స్వభావం నరసింహారావుగారిది. ఆసంగతి బాగా ఎరిగిఉన్నాడు లక్ష్మీకాంతం.

ఈవిధంగా ఏదీ పడనివ్వడని తాత్కాలికమైన కోపాలతో ఏడాది గడిపారు దంపతులు.

రాజ్యం చిన్నబుచ్చుకున్నప్పుడు లక్ష్మీకాంతం తనమాటే నెగ్గుతుందనుకొనేవాడు. లక్ష్మీకాంతం హుతాశుడైనప్పుడు రాజ్యము తానే గెలుస్తాననుకునేది.

సంవత్సరాది పండుగకు దంపతుల నిద్దరిని తనయింటికి ఆహ్వానించాడు నరసింహారావు.

భోజనాలయిన తరువాత ఊరికి పడమరవైపు తోటలోకి వెళ్దాము రండని పిలుచుకొని పోయినాడు.

జర్మన్ డిజైనులో కట్టబడిన చిన్న బంగళా—చుట్టూ చిన్నతోటా—ఒకపక్క గరాజ్—అందులో టూ సీటర్ కారు—అన్నీ చూపిస్తూ తోటలో ఉన్న సిమెంటు సీట్లమీద కూచోబెట్టి మాట్లాడుతున్నాడు నరసింహారావు.

ఇంతలోకే బంగళా లోపలినుంచి రేడియోపాట!

దంపతులిద్దరు ఆనంద బాష్పాలతో నరసింహారావుగారికి ఒక్కసారే నమస్కరించారు.

---